సాక్షి
కాకినాడ
గురువారం । 17 । ఆగస్టు । 2023



అన్నదాన ట్రస్టుకు విరాళం

ఐ.పోలవరం: మురమళ్ల శ్రీ భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్‌కు చెందిన గరిమెళ్ల వెంకటాచలం దంపతులు 1,200 డాలర్లు ఇచ్చారు.



కాలువలకు నీరు

ధవళేశ్వరం: బ్యారేజీ నుంచి బుధవారం తూర్పు డెల్టాకు 4,900, మధ్య డెల్టాకు 2,600, పశ్చిమ డెల్టాకు 7,500 క్యూసెక్కుల నీటిని వదిలారు.

తెలుగు ఔన్నత్యాన్ని కాపాడుతున్న ప్రభుత్వం



రాష్ట్రంలో తెలుగు భాష ఔన్నత్యాన్ని కాపాడుతూ ఆంగ్ల భాషలో కూడా విద్యార్థులు మంచి పట్టును సాధించే దిశగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దడం హర్షణీయమని ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు అన్నారు.

8లో

న్యూస్‌రీల్

నేడు రత్నగిరి దేవస్థానానికి బస్సు అందజేత

అన్నవరం: ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం 'స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా' చైర్మన్ దినేష్ ఖర గురువారం రత్నగిరిపై సత్యదేవుని వ్రతమాచరించి స్వామివారిని దర్శించనున్నారు. ఈ సందర్భంగా బ్యాంక్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద రూ.30 లక్షలు విలువ చేసే బస్సును దేవస్థానానికి అందజేయనున్నట్లు స్థానిక స్టేట్ బ్యాంక్ మేనేజర్ రఘురామ్ తెలిపారు. గతంలో అన్నవరం దేవస్థానానికి స్టేట్‌బ్యాంక్ రెండు బ్యాటరీ కార్లు బహూకరించిందన్నారు. అన్నవరం రైల్వేస్టేషన్ నుంచి రత్నగిరికి భక్తులను చేరవేసేందుకు ఈ బస్సు అందచేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఐసీడీఎస్‌లో కాంట్రాక్ట్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కాకినాడ సిటీ: జిల్లా మహిళా, శిశు సంక్షేమ, సాధికారిత అధికారి పరిధిలో ఇసనిప్ పోషణ్ అభియాన్ 2.0లో పూర్తిగా కాంట్రాక్ట్ పద్ధతిపై పని చేసేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐసీడీఎస్ పీడీ కె.ప్రవీణ బుధవారం తెలిపారు. జిల్లా ప్రాజెక్టు కో ఆర్డినేటర్ ఒకటి, జిల్లా ప్రాజెక్టు అసిస్టెంట్ ఒకటి, బ్లాక్ కో ఆర్డినేటర్ రెండు పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. బ్లాక్ కో ఆర్డినేటర్ పోస్టుకు సంబంధించి జగ్గంపేట, శంఖవరాల్లో పని చేయాల్సి ఉంటుందన్నారు. ఈ పోస్టులు పూర్తిగా కాంట్రాక్ట్ పద్ధతిపై రోస్టర్ ప్రకారం హైరింగ్ ద్వారా సెలక్షన్ కమిటీ చైర్మన్ కలెక్టర్ ఒక ఏడాది కాలానికి నియమించనున్నట్టు తెలిపారు. అర్హులైన అభ్యర్థులు జిల్లా వెబ్‌సైట్ నుంచి బయోడేటా డౌన్‌లోడ్ చేసుకుని ధ్రువపత్రాల నకలు జతచేసి ఈ నెల 31వ తేదీ లోపు తమ కార్యాలయానికి సమర్పించాలని పీడీ ప్రవీణ సూచించారు.

రంగరాయలో విద్యార్థుల చేరిక

కాకినాడ క్రైం: కాకినాడ రంగరాయ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ విద్యార్థుల చేరికలు ప్రారంభమయ్యాయి. వెబ్ ఆప్షన్ల ద్వారా కేటాయింపులు పొందిన 210 మంది విద్యార్థుల్లో 11 మంది తొలి రోజు బుధవారం చేరారు. గురువారానికి మరో 100 మంది చేరేందుకు అనుగుణంగా రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పూర్తయింది. సీటు కేటాయింపుల కోసం నిర్వహించే వెబ్ ఆధారిత కౌన్సెలింగ్ ఈ నెల 19వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు పూర్తికానుందని కళాశాల యాజమాన్యం తెలిపింది.

రాష్ట్ర ఫుట్‌బాల్ ఆపరేషన్స్ డైరెక్టర్‌గా రాజేష్

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడసిటీ): రాష్ట్ర ఫుట్‌బాల్ సంఘ ఆపరేషన్స్ డైరెక్టర్‌గా జిల్లా ఫుట్‌బాల్ సంఘ కార్యదర్శి కె.రాజేష్ నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం రాష్ట్ర కార్యదర్శి దానియేల్ ప్రదీప్ నుంచి నియామక ఉత్తర్వులు అందుకున్నారు. వివిధ రకాల టోర్నమెంట్లు, రాష్ట్రంలో ఫుట్‌బాల్ అభివృద్ధికి చేపట్టే కార్యక్రమాలు, కోచ్‌లను సమన్వయపరచడం, సంఘ రోజువారీ కార్యకలాపాల పరిపాలన, క్రీడాకారులను ప్రోత్సహించడం, స్పాన్సర్స్ సౌజన్యంతో వివిధ రకాల జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల నిర్వహణ వంటి బాధ్యతలు రాజేష్ నిర్వహించాల్సి ఉంది. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ రాష్ట్ర కార్యవర్గం తనకు అప్పగించిన బాధ్యతను సక్రమంగా నిర్వహించి రాష్ట్రంలో ఫుట్‌బాల్ అభివృద్ధికి చర్యలు తీసుకుంటానని తెలిపారు.

18న ఎమ్మెల్సీ పద్మశ్రీ ప్రమాణస్వీకారం



కాకినాడ: గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా ఎంపికైన కర్రి పద్మశ్రీ ఈనెల 18వ తేదిన ప్రమాణస్వీకారం చేయనున్నారని కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి చెప్పారు. శాసన మండలి స్పీకర్ మోషేన్‌రాజు ఆమెతో ప్రమాణ స్వీకారం చేయిస్తారని తెలిపారు. విజయవాడలో ఈ ప్రమాణస్వీకార కార్యక్రమం జరుగుతోందన్నారు. గవర్నర్ ఆమోదంతో కర్రి పద్మశ్రీ నియామకాన్ని ఖరారు చేస్తూ ఇటీవలే జీవో విడుదల అయిన నేపథ్యంలో ప్రమాణస్వీకారోత్సవానికి ముహూర్తం ఖరారు చేసుకున్నారు.

కాంట్రాక్ట్ అధ్యాపకుల రెన్యువల్‌కు దరఖాస్తులు

కొత్తపేట: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలో గల ఏడు ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో కాంట్రాక్ట్ విధానంలో పనిచేస్తున్న అధ్యాపకులను 2023–24 విద్యా సంవత్సరానికి రెన్యువల్ చేసేందుకు దరఖాస్తులు కోరుతున్నట్టు స్థానిక ఐడెంటిఫైడ్ (ఐడీ) వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీ రాజు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2022–23 విద్యా సంవత్సరంలో ఈ ఏడాది మార్చి 31 నాటికి ఆ అధ్యాపకులుగా పనిచేసినవారు, కాంట్రాక్ట్ ఉద్యోగులు కూడా అర్హులని తెలిపారు. ఈ నెల 19 సాయంత్రం 5 గంటల లోపు సంబంధిత కళాశాలలో దరఖాస్తులు సమర్పించాలన్నారు.

'బయో'త్పాతానికి బాధ్యులెవరు



- రంగుల డస్ట్ బిన్ల వినియోగంలో హౌస్ సర్జన్లు, నర్సుల నిర్లక్ష్యం
- పలుమార్లు సాధారణ డంప్ యార్డుకు చేరుతున్న బయోమెడికల్ వ్యర్థాలు
- జీజీహెచ్‌కు జరిమానా విధించినా తీరు మారని వైనం



కాకినాడలోని ఎమర్జెన్సీ విభాగంలో కలర్ కోడెడ్ డస్ట్ బిన్‌లు

కాకినాడ క్రైం: కాకినాడ జీజీహెచ్‌లో ఓ అసాధారణ స్థితి కొనసాగుతోంది. విద్యాబుద్ధులు నేర్చిన వైద్య వృత్తిలోని ఆదర్శవంతులే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దిద్దుకోలేని తప్పులు చేస్తున్నారు. కింది స్థాయి సిబ్బంది, రోగులు, వారి బంధువులకు ఆదర్శంగా నిలవాల్సిన హౌస్ సర్జన్లు, నర్సుల్లో కొందరు తమకేమీ పట్టనట్టు ఉంటున్నారు. నిబంధనల ప్రకారం అనుసరించాల్సిన నియమాలను గాలికొదిలేస్తున్నారు. 'బయో'త్పాతానికి ప్రత్యక్ష కారకులవుతున్నారు. అదేదో కష్టసాధ్యమైన పని అప్పగిస్తే చేయడానికి ఆపసోపాలు పడుతున్నారనుకుంటే పొరపాటే. వార్డుల్లో వ్యర్థాలు సేకరించేందుకు ఏర్పాటు చేసిన రంగు డబ్బాలను తగిన రీతిలో నిర్వహించడంలో బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారు. తమ నిర్లక్ష్యం కొందరి ప్రాణాలకు ముప్పుగా పరిణమిస్తుందని సిబ్బంది గ్రహించడం లేదు. వార్డులో వ్యర్థాలను సేకరించేందుకు జాతీయ వైద్య నియంత్రణ మండలి సూచనల మేరకు ప్రభుత్వం మూడు రంగుల చెత్త బుట్టలను ప్రవేశపెట్టింది. ఏ రంగు డబ్బాలో ఏ వ్యర్థాలు వేయాలో కూడా సూచనలు జారీ చేసింది. కొందరు హౌస్ సర్జన్లు, నర్సుల వల్ల ఈ నియమావళి జీజీహెచ్‌లో అమలు కావడం లేదు. రంగుల నిబంధనలు పక్కన పెట్టి వ్యర్థాలను దొరికిన డబ్బాల్లో వేసేస్తున్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. వీరి నిర్వాకంపై వివిధ శాఖల అధికారులతో పాటు సామాన్య ప్రజల్లోనూ ఆందోళన కలుగుతోంది.



బయోమెడికల్ వ్యర్థాలను తూచి తరలిస్తున్న దృశ్యం

ఏ డబ్బాల్లో ఏం వేయాలంటే..

- సాధారణంగా మూడు రంగుల డస్ట్‌బిన్లు వార్డుల్లో వినియోగిస్తారు. అవి ఎరుపు, నీలం, పచ్చ.
- అదనంగా పంచర్ ప్రూఫ్ కంటైనర్లు వినియోగిస్తారు.
- పసుపు డబ్బాల్లో శరీర భాగాలు, శరీర ద్రవాలు, ప్లసెంటాలు, అవయవాలు, నమూనాలు, కణజాలాలు, రోగకణ వ్యర్థాలు, సూక్ష్మక్రిమి వ్యర్థాలు, నెత్తురు, చీము, గాయాలకు అంటించిన వస్తువులు, బ్లడ్ బ్యాగ్‌లు, కాలం చెల్లిన మందులు, టీకాలు, డ్రస్సింగ్ వ్యర్థాలు, దూది, పిండి కట్టు వ్యర్థాలు, డయపర్లు, గాజుగుడ్డ, మాస్కులు వేయాలి.
- ఎర్ర చెత్త బుట్టలో రైయల్స్ ట్యూబ్‌లు, సూదులు, సిరంజీలు, ఐవీ సెట్లు, సెలైన్ సీసాలు, గ్లవ్స్‌లు, ప్లాస్టిక్ గొట్టాలు, ప్లాస్టిక్ సీసాలు, యూరిన్ బ్యాగ్‌లు క్యాథేటర్లు వేయాలి.
- నీలం డబ్బాలో గాజు సీసాలు, వయల్స్, యాంపిళ్లు, ఇంప్లాంట్లు వేయాలి. పంచర్ ప్రూఫ్ కంటైనర్లలో అయితే కట్టర్‌తో కత్తిరించిన సూదులు, బ్లేడ్‌లు, విరిగిన గాజు, పగిలిన స్లైడ్‌లు, లాన్ సెట్లు, నెయిల్స్, బ్లేడ్‌లు, సూదులు, సిరంజీలు వేయాలి.

ఇటీవల కొద్ది రోజుల గణాంకాలివి (కిలోల్లో)

తేదీ	పసుపు డబ్బా	ఎరుపు డబ్బా	నీలం డబ్బా
7-8-23	54	11.5	1.20
8-8-23	51	10	1.25
9-8-23	50	11	1.35
10-8-23	49.5	14	1.70
11-8-23	57	12	1.80
12-8-23	52.5	10.5	1.35

అలక్ష్యమే కారణం

సిబ్బంది నిర్లక్ష్యాన్ని గమనించిన మున్సిపల్ విభాగం అధికారులు ఈ విషయంపై నేరుగా కాలుష్య నియంత్రణ మండలిని ఆశ్రయించారు. సాధారణ డంప్ యార్డులో వ్యర్థాలను ఒంపితే అందులో తొలగించిన శరీర భాగాలు కనిపించడమే అందుకు కారణం. ఫిర్యాదులను పరిశీలించిన ఉన్నతాధికారులు ఈ ఏడాది ఆరంభంలో జీజీహెచ్‌లో తనిఖీలు నిర్వహించగా నిర్లక్ష్యం సుస్పష్టమైంది. పొడి చెత్త వేయాల్సిన చెత్త బుట్టలో శరీర వ్యర్థాలు, సాధారణ డంప్ యార్డుకి చేరే చెత్త బుట్టలో ప్రమాదకరమైన ఇంజెక్షన్లు చూసి నివ్వెరపోయారు. ఈ తంతు అంతా కొందరు నర్సులు, హౌస్ సర్జన్ల అలక్ష్యం వల్లే జరుగుతోందని నిర్ధారణకు వచ్చారు. కాలుష్య నియంత్రణ మండలి భారీ జరిమానా.. అక్షరాలా రూ.16.50 లక్షలు వేసింది. మరోమారు ఇదే కొనసాగితే తీవ్ర చర్యలు ఉంటాయని హెచ్చరించింది.

బాధ్యతారాహిత్యంపై ఆగ్రహం

ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారంటూ పలువురు నర్సులు, హౌస్ సర్జన్ల తీరుపై తనిఖీ అధికారులు జీజీహెచ్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. రంగులకు అనుగుణంగా వ్యర్థాలను నిర్వహించడంలో తోటీలు, ఇతర పారిశుధ్య విభాగాలకు చెందిన సిబ్బంది ఎంతో నిబద్ధతతో వ్యవహరిస్తున్నారనీ, వారి కంటే విద్యాధికులైన నర్సులు, హౌస్ సర్జన్లలో కొందరు అత్యంత బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

తరలింపునకు ప్రత్యేక వ్యవస్థ

జీజీహెచ్‌లో సమకూరే వ్యర్థాల తరలింపునకు ప్రత్యేక వ్యవస్థ ఉంది. సాధారణ వ్యర్థాల కోసం మున్సిపల్ విభాగం ప్రత్యేక వాహనాన్ని ఆసుపత్రి డంప్ యార్డు వద్ద ఏర్పాటు చేసింది. బయో మెడికల్ వ్యర్థాలన్నింటినీ రాజానగరానికి చెందిన ఈవీబీ టెక్నాలజీస్ సంస్థ తన ప్రత్యేక వాహనంలో తరలిస్తుంది. నిర్దిష్ట గణాంకాల కోసం బయో మెడికల్ వ్యర్థాలను బరువు తూచి మరీ తరలిస్తారు. అలాగే సమకూరిన వ్యర్థాలను డస్ట్ బిన్ల రంగుల వారీగా బరువును లెక్కిస్తారు. అలాగే వాహనాలు వచ్చే లోపు సేకరించి భద్ర పరిచేందుకు ప్రత్యేక గదులున్నాయి. ఈ వ్యవస్థను పర్యవేక్షించేందుకు ఓ ప్రత్యేక అధికారి ఉంటారు.

నర్సులు, హౌస్ సర్జన్లకు శిక్షణ



కలర్ కోడ్‌కి అనుగుణంగా వ్యర్థాలు నిర్వహించాలని వార్డుల్లో నర్సులు, హౌస్ సర్జన్లకు సూచించాం. సేవలందించే వైద్యులు, నర్సులు సమన్వయంతో ఇటువంటి నిబంధనలు కొనసాగేలా చూడాలి. పలు సందర్భాల్లో సమన్వయ లోపంతో సమస్య జటిలమవుతోంది. నర్సులు, హౌస్ సర్జన్లకు విడివిడిగా శిక్షణ తరగతులు నిర్వహించాం. జరిమానా వరకు వెళ్లిన పరిస్థితి సరైనది కాదు. పారిశుధ్య కార్మికులకు కూడా ఈ తరహా శిక్షణ ఇస్తాం.

– డాక్టర్ హేమలతాదేవి, జీజీహెచ్ సూపరింటెండెంట్

కచ్చితంగా ప్రాణాంతకం



బయోమెడికల్ వ్యర్థాలు సాధారణ వ్యర్థాలతో కలవడం అత్యంత ప్రమాదకరం. హెచ్‌ఐవీ, హెచ్‌బీఎస్‌ఏజీ, హెపటైటిస్ వంటి ప్రాణాంతక, సాంక్రమిక వ్యాధులు బయోమెడికల్ వ్యర్థాలైన సూదులు గుచ్చుకోవడం వల్ల మరో వ్యక్తికి సంక్రమిస్తాయి. రక్తపు వ్యర్థాలు, వస్త్రాల వల్ల బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్లు వ్యాప్తి చెందే అవకాశం ఉంది. డంపింగ్ యార్డ్‌ల పరిసరాలు, డంపింగ్ వాహనాలు ప్రయాణించే మార్గాల్లో మట్టిలో ఆడే పిల్లలకు ఇవి హానిచేస్తాయి.

– డాక్టర్ కామాడి రామారావు, అసోసియేట్ ప్రొఫెసర్, జనరల్ సర్జరీ

నేటి నుంచి సత్యవిదియ వేడుకలు

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని 133వ సత్యవిదియ వేడుకలు గురువారం నుంచి ప్రారంభమవుతాయని బుధవారం ఆలయ అధికారులు తెలిపారు. ఈ మేరకు రత్నగిరిపై ఏర్పాట్లు పూర్తి చేశారు. గురువారం స్వామివారి జన్మ నక్షత్రం మఖ సందర్భంగా తెల్లవారుజామున స్వామి, అమ్మవార్లకు పంచామృతాభిషేకాలు నిర్వహిస్తారు. అనంతరం నూతన పట్టు వస్త్రాలతో సత్యదేవుడు, అమ్మవారిని అలంకరించి దర్శనానికి భక్తులను అనుమతిస్తారు. ఉదయం తొమ్మిది గంటలకు సత్యావిదియ వేడుకలను ప్రారంభిస్తారు. ఈ వేడుకల్లో భాగంగా జపాలు, హోమాలు తదితర కార్యక్రమాలు నిర్వహించేందుకు 40 మంది రుత్విక్కులు, ఇతర వైదిక సిబ్బందికి దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ చంద్రశేఖర్ అజాద్ దీక్షావస్త్రాలు అందజేస్తారు. సత్యవిధియ సందర్భంగా శుక్రవారం సత్యదేవుడు, అమ్మవార్ల మూలవిరాట్‌లకు మహాన్యాశపూర్వక రుద్రాభిషేకం నిర్వహిస్తారు. అనంతరం నూతన పట్టువస్త్రాలు, స్వర్ణాభరణాలతో అలంకరించి ఉదయం ఏడు గంటల నుంచి భక్తులకు దర్శనం కల్పిస్తారు. ఉదయం 11 గంటలకు హోమం పూర్ణాహుతి నిర్వహిస్తారు. ఈ సందర్భంగా 12 మంది పండితులను ఘనంగా సత్కరించనున్నట్లు ఈఓ చంద్రశేఖర్ అజాద్ తెలిపారు.



చదును చేసిన రోడ్డును పరిశీలిస్తున్న ఈఓ చంద్రశేఖర్ అజాద్, ఎస్ఈ శేఖర్

నవంబర్ నాటికి పాత లింక్‌రోడ్డు నిర్మాణం

శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో పాత సీఆర్వో ఆఫీసు వెనుక నుంచి రెండో ఘాట్‌రోడ్ మూడో మలుపు వరకు చదును చేసిన రోడ్డు (లింక్ రోడ్డు) మీద నవంబరు నాటికి బీటీ రోడ్డు నిర్మించనున్నట్టు ఈఓ చంద్రశేఖర్ అజాద్ తెలిపారు. దేవదాయశాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ జీవీ శేఖర్‌తో కలిసి ఆయన బుధవారం ఆ రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ కార్తికమాసంలో భక్తుల రద్దీ అధికంగా ఉంటుందన్నారు. అప్పటికి ఈ రోడ్డును ప్రారంభించాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పటికే రూ.1.40 కోట్ల వ్యయంతో ఈ రోడ్డుపై బీటీ రోడ్డు నిర్మాణానికి టెండర్లు పిలిచేందుకు దేవదాయశాఖ కమిషనర్ అనుమతి ఇచ్చినట్లు తెలిపారు. ప్రస్తుతం ఈ రోడ్డు మీద పటిష్టమైన భద్రత మధ్య వాహనాలను అనుమతించినట్లు తెలిపారు. ఎస్ఈ జీవీ శేఖర్ మాట్లాడుతూ రోడ్డును పది మీటర్లు వెడల్పున నిర్మించే బదులు కొండను చదును చేసి ఏడు మీటర్లు వెడల్పున రోడ్డు నిర్మించాలని సూచించారు. దీని వలన రెండు వరుసలలో వాహనాలు వెళ్లేందుకు వీలుంటుందన్నారు. ఈఈ నరశింహారెడ్డి, డీఈలు రతన్ రాజు, బీ ఎస్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం సేకరణ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి

- జాయింట్ కలెక్టర్ ఇలక్కియ
- వివిధ శాఖల అధికారులతో సమీక్ష

కాకినాడ సిటీ: ఖరీఫ్ 2023–24 సీజన్‌కు సంబంధించి రైతుల నుంచి ధాన్యం సేకరించేందుకు అవసరమైన కేంద్రాలపై అధికారులు దృష్టి సారించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ అన్నారు. పండించిన ధాన్యానికి కనీస మద్దతు ధర పొందడానికి ప్రభుత్వం కల్పించిన సదుపాయాలు, ధాన్యం సేకరణ కేంద్రాల నిర్వహణపై బుధవారం ఆమె కలెక్టరేట్‌లో వ్యవసాయాధికారి, లీగల్ మెట్రాలజీ డిప్యూటీ కంట్రోలర్, జిల్లా పౌర సరఫరాల మేనేజర్, మార్కెటింగ్ అసిస్టెంట్ డైరెక్టర్, లేబర్ డిపార్టుమెంట్, రీజినల్ ట్రాన్స్‌పోర్టు అధికారి తదితర శాఖల అధికారులతో సమీక్షించారు. రైతు భరోసా కేంద్రం, మిల్లుల వద్ద తేమ శాతాన్ని ఒకే విధంగా ఉండేలా చూసేందుకు ఒకే విధమైన యంత్రాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ-క్రాప్‌లో రైతులు పంట నమోదుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



అధికారులతో సమీక్షిస్తున్న జేసీ ఇలక్కియ

గోనె సంచుల నిల్వకు ప్రతి మండలంలోనూ తగిన గోదాము ఉండేలా చూడాలన్నారు. మిల్లుల నుంచి 50 శాతం గోనె సంచులు ఈ గోదాములో ఉండేలా చూడాలన్నారు. ధాన్యం సేకరణపై అవగాహన కల్పించేలా వివిధ ప్రసార మాధ్యమాల ద్వారా కార్యక్రమాలు చేపట్టాలని జేసీ ఆదేశించారు. ఈ సమావేశంలో పౌర సరఫరాల జిల్లా మేనేజర్ డి.పుష్పమణి, జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.విజయకుమార్, డీఎస్‌వో ఎంవీ ప్రసాద్, డీసీవో దుర్గాప్రసాద్, ఆర్‌టీవో పి.సాయిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వరీఫ్ ఉక్కిరి బిక్కిరి

- కోనసీమ జిల్లాలో వేసవిని తలపిస్తున్న ఎండలు
- 34 నుంచి 36 డిగ్రీల ఉష్ణోగ్రతలు
- సాగుపై ప్రభావంతో రైతులకు ఇబ్బందులు
- ఆపసోపాలు పడుతున్న సామాన్యులు



ఉప్పలగుప్తం మండలం భీమనపల్లిలో నారుమడి సేకరిస్తున్న వ్యవసాయ కూలీలు

సాక్షి అమలాపురం: మబ్బులు పడుతున్నాయి. వర్షం జాడ కానరావడం లేదు. ఆగస్టు ఒకటవ తేదీ నుంచి ఇదే పరిస్థితి. ఉమ్మడి జిల్లాలో రాజమహేంద్రవరం, కాకినాడ జిల్లాలో అడపాదడపా ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురుస్తున్నా... కోనసీమలో మాత్రం వర్షం జాడ లేకుండా పోయింది. మరోవైపు ఎండలు మండిపోతున్నాయి. మండు వేసవిని తలపిస్తున్నాయి. ఒకవైపు ఉక్కపోత వాతావరణంతో సామాన్యులు ఆపసోపాలు పడుతుండగా... మరోవైపు సాగు ముందుకు సాగక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా వాసులు ఈ ఏడాది ముచ్చటగా మూడవ వేసవిని చవిచూస్తున్నారు. ఏప్రిల్, మే నెలలో అసలైన వేసవి చూసిన జిల్లా వాసులు జూన్‌లో నైరుతి రుతుపవనాలు ఆలస్యంగా రావడంతో రెండవ వేసవిని చూశారు. ఇక ప్రస్తుత ఆగస్టులో చినుకు జాడ లేకపోవడంతో ముచ్చటగా మూడవ వేసవిని చూస్తున్నారు. జిల్లాలో గత పదిపదిహేను రోజులుగా గరిష్ట ఉష్ణోగ్రతలు 34 డిగ్రీల నుంచి 36 డిగ్రీల వరకు నమోదవుతున్నాయి. కనిష్ట ఉష్ణోగ్రతలు సైతం 26 డిగ్రీల నుంచి 28 డిగ్రీల మధ్య ఉంటున్నాయి. దీంతో సామాన్యులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వేసవిని తలపిస్తున్న ఎండలతో మధ్యాహ్నం ఆపసోపాలు పడుతున్నారు. రాత్రి వేళల్లో కూడా వేడిగాలితో చెమటలు కక్కుతున్నారు.

ప్రతినెలా లోటు వర్షం

జూన్ నెల నుంచి ఇప్పటి వరకు ప్రతి నెల లోటు వర్షమే. కాని ఆగస్టు నెలలో పరిస్థితి మరీ దారుణం. ఏకంగా 96 శాతం లోటు వర్షం నమోదయ్యింది. ఈ నెలలో 16వ తేదీ వరకు 130.5 మిల్లీమీటర్ల వర్షం కురవాల్సి ఉండగా, కేవలం 6 మిల్లీమీటర్ల పడడం గమనార్హం. జూనె నెలలో 111.4 మి.మీటర్లకుగాను 70.6 మి.మీటర్లు పడగా, జూలై నెలలో 241 మి.మీటర్లకు గాను, 189.8 మి.మీటర్ల వర్షం పడింది. జిల్లావ్యాప్తంగా ఇప్పటి వరకు 482..9 మి.మీటర్ల వర్షం పడాల్సి ఉండగా 266.4 మి.మీటర్ల మాత్రమే పడింది.

నాట్లు ఆలస్యం

నైరుతిలో లోటు వర్షం కురవడంతో ఆ ప్రభావం ఖరీఫ్ సాగుపై పడింది. జిల్లాలో 1.74 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ సాగు జరగాల్సి ఉండగా, ఇప్పటి వరకు 1,42,570 ఎకరాల్లో నాట్లు పడ్డాయి. డెల్టాలో ఆగస్టులో సైతం నాట్లు పడడం సర్వసాధారణమే అయినా వర్షాలు ముఖం చాటేయడంతో పలుచోట్ల ఆలస్యమవుతున్నాయి. ముమ్మిడివరం, అమలాపురం, రాజోలు వ్యవసాయ సబ్ డివిజన్‌లో ఇప్పటికీ నాట్లు వేసే పనిలో రైతులున్నారు. లోటు వర్షమే అయినా ఖరీఫ్ ఆశాజనకంగా ఉందంటే అందుకు గోదావరి కారణం. సాగు ఆరంభంలో గోదావరిలో కూడా నీరు అనుకున్న స్థాయిలో లేకున్నా తరువాత వరద పోటు తగలడంతో నీటికి ఇబ్బంది లేకుండా ఉంది. మరోవైపు ఉద్యాన పంటలపై కూడా లోటు వర్షం ప్రభావం చూపుతోంది. ముఖ్యంగా కొబ్బరిపై తెల్లదోమ విజృంభణ పెరిగింది. పగటి, రాత్రి ఉష్ణోగ్రతల మధ్య వ్యత్యాసం పది డిగ్రీలు దాటి నమోదవుతుండడంతో దోమ ఉధృతి పెరిగింది. కొబ్బరితోపాటు ఆయిల్ పామ్‌లో కూడా తెల్లదోమ అధికంగా ఉంది.

జిల్లాలో వర్షం ఇలా..

నెల	కురవాల్సిన వర్షం	కురిసిన వర్షం	లోటు (శాతం)
జూన్	11.4	70.6	37
జూలై	241	189.8	22
ఆగస్టు (16వ తేదీ వరకు)	130.5	6	96
జూన్ 1వ తేదీ నుంచి ఆగస్టు 16 వరకు (జిల్లా వ్యాప్తంగా)	482.9	266.4	49

సాగు ఆలస్యం అయింది



వర్షాలు లేకపోవడం, వరదల వల్ల జిల్లాలో ఖరీఫ్ సాగు ఆలస్యం అయ్యింది. కోనసీమలో ఆగస్టు నెలలో నాట్లు వేయడం ప్రతి ఏటా జరిగేదే. వచ్చే పది పదిహేను రోజులలో జిల్లాలో నాట్లు పూర్తి కానున్నాయి.

– బోస్ బాబు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, కోనసీమ జిల్లా



ఆలమూరు మండలం జొన్నాడ సెంటర్లో మిట్ట మధ్యాహ్నం నిర్మానుష్యంగా ఉన్న జాతీయ రహదారి

సీఐలుగా పదోన్నతులు

కాకినాడ క్రైం: కాకినాడ జిల్లా పోలీస్ పరిధిలో వివిధ ప్రాంతాల్లో విధులు నిర్వర్తిస్తున్న పలువురు సబ్ ఇన్‌స్పెక్టర్లకు సీఐలుగా పదోన్నతి లభించింది. పదోన్నతులు పొందిన వారిలో ఎం.నాగరాజు, పీతల దొరరాజు, తాడంకి క్రాంతి కుమార్, బొంగు తిరపతిరావు, చల్లపల్లి విద్యాసాగర్ ఉన్నారు. వీరు జిల్లాలో వివిధ స్టేషన్లలో ఎస్ఐలుగా పనిచేస్తున్నారు.

26 నుంచి వెంకన్న పవిత్రోత్సవాలు



ఆత్రేయపురం: వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి వారి పవిత్రోత్సవాలు ఈ నెల 26 నుంచి మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. పవిత్రోత్సవాల సందర్భంగా మూడురోజుల పాటు ఆలయంలో అష్టోత్తర పూజలు, కల్యాణాలు, ఉపనయనాలు, వివాహాలు రద్దు చేశామన్నారు. శనివారం పవిత్రోత్సవాలు ప్రారంభం కావడంతో భక్తులు సంఖ్య పెరుగుతుందని, ఆ మేరకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. 26న ఉదయం 8 గంటలకు విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సాయంత్రం 5 గంటలకు సంకల్పం, అంకురార్పణ, అగ్ని ప్రతిష్ఠాపన, 27న ఉదయం 8 గంటలకు సంకల్పం, విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సాయంత్రం 5 గంటలకు పవిత్రారోహణం, విశేష అర్చన, ప్రధాన హోమాలు, 28న ఉదయం 8 గంటలకు సంకల్పం, మహాశాంతి హోమం, ప్రాయశ్చిత్త హోమం, మహాపూర్ణాహుతి, పవిత్ర విసర్జన, మహదాశీర్వచనం నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు వివరించారు.

క్లుప్తంగా

ఇంజిన్ల దొంగలకు దేహశుద్ధి



పట్టుబడిన ఆటో ఇంజిన్ల దొంగలు

కాట్రేనికోన: మండల పరిధిలోని వేట్లపాలెంలో పట్టా గంగరాజు ఇంటి వద్ద ఉన్న ఆటో ఇంజిన్‌ను మంగళవారం అర్ధరాత్రి ముగ్గురు యువకులు ట్రక్ ఆటోలో వచ్చి దొంగిలిస్తున్న సమయంలో గ్రామస్తులు పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం అర్ధరాత్రి ట్రక్ ఆటో గచ్చకాయలపోర నుంచి కాట్రేనికోన వైపు వెళుతూ వేట్లపాలెంలో రోడ్డుపై ఆగింది. ట్రక్ ఆటోను రోడ్డుపై ఉంచి ఇద్దరు వ్యక్తులు పట్టా గంగరాజు ఇంటి వద్ద ఉన్న ఆటో ఇంజిన్‌ను పట్టుకుని వెళుతున్న సమయంలో స్థానికులు పట్టుకున్నారు. పి.గన్నవరం మండలం పప్పులవారిపాలెంకు చెందిన ఆటో డ్రైవర్ పేరాబత్తుల నాని పారిపోగా వాండ్రాసు రాజు, పామర్తి రాంచరణ్ పట్టుబడ్డారు. గచ్చకాయలపోర రోడ్డులో దొంగిలించిన రెండు ఆటో ఇంజిన్లతో పాటు ట్రక్ ఆటోను, ఇద్దరు దొంగలను పోలీసులకు అప్పగించారు. కాట్రేనికోన ఎస్సై టి.శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో జైలు

జగ్గంపేట: జగ్గంపేట పోలీసు స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ కార్యక్రమంలో పట్టుబడ్డ ఏడుగురిని పెద్దాపురం కోర్టులో హాజరు పరచగా ఒక వ్యక్తికి 15రోజులు జైలు శిక్ష, ఆరుగురికి రూ.10వేలు చొప్పున రూ.60వేలు జరిమానా న్యాయమూర్తి విధించినట్లు జగ్గంపేట ఎస్సై విద్యాసాగర్ తెలిపారు.

22న ఆర్టీసీలో మిగిలిపోయిన పార్సిల్స్ వేలం

రాజమహేంద్రవరం సిటీ: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఆర్టీసీ పార్సిల్ కార్యాలయంలో పార్సిల్స్ బుక్ చేసి, వినియోగదారులు తీసుకువెళ్లని వాటిని ఈ నెల 22వ తేదీన రాజమహేంద్రవరంలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ (కమర్షియల్) పీబీ మల్లికార్జునరాజు బుధవారం ప్రకటించారు. ఉదయం 11గంటలకు నిర్వహించే బహిరంగ వేలంను రాజమహేంద్రవరం బస్ స్టేషన్ ఆవరణలో ఉన్న పార్సిల్ ఆఫీస్ వద్ద నిర్వహించనున్నామన్నారు.

అవగాహనకు ఆలంబనగా..

- వలు అంశాలపై బోధనకు నిలయంగా విస్తరణ శిక్షణ కేంద్రం
- 11 జిల్లాల్లోని అధికారులు, ప్రజా ప్రతినిధులకు ప్రయోజనం



సామర్లకోటలోని విస్తరణ శిక్షణ కేంద్రం



ఉపాధి హామీ అధికారులకు శిక్షణ ఇస్తున్న ఫ్యాకల్టీలు (ఫైల్)

సామర్లకోట: స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రం (ఈటీసీ) ప్రభుత్వ ఉద్యోగులు, నిరుద్యోగులు, ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులకు తర్ఫీదుకు నిలయంగా ఉంది. జిల్లా పరిషత్తు, మండల పరిషత్తు సూపరింటెండెంట్, మండల పరిషత్తు, పంచాయతీల సీనియర్ జూనియర్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులకు కంప్యూటర్‌లో, మహిళా సంఘాలకు వాటి నిర్వహణపై శిక్షణ ఇచ్చారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీఓ, ఎంపీపీ, తహసీల్దార్, ఈఓపీఆర్డీ, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, టెక్నీషియన్లు, భారత్ నిర్మాణ వలంటీర్లకు, ఆపద మిత్రలకు శిక్షణ పూర్తి చేశారు. మెప్మా అధికారులకు ఆయా శాఖలలో పనులకు సంబంధించిన అంశాలపై రెసిడెన్షియల్ శిక్షణ ఇస్తున్నారు.

ప్రాథమిక వ్యవసాయ క్షేత్రం నుంచి విస్తరించింది ఇలా..

1952 అక్టోబర్ రెండో తేదీన 143 ఎకరాల విస్తీర్ణంతో ప్రాథమిక వ్యవసాయ క్షేత్రంగా ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ప్రారంభంలో గ్రామీణ ప్రాంతాలలో వ్యవసాయ పనివార్లకు శిక్షణ ఇచ్చేవారు. 1958 అక్టోబర్ ఒకటిన వ్యవసాయ క్షేత్రాన్ని, గ్రామ సేవక్ కేంద్రంగా పేరు మార్చారు. వ్యవసాయం, పశువుల పెంపకం, మత్స్య శాఖల ద్వారా శిక్షణ ఇచ్చేవారు. జూన్ 1972లో వీడీఓల శిక్షణ కేంద్రంగా మార్పు చేశారు. సర్వీసు కమిషన్ ద్వారా ఎంపిక అయిన వీడీఓలకు ఇక్కడ శిక్షణ ఇచ్చేవారు. వీడీఓల శిక్షణ కేంద్రంగా ఉన్న సమయంలో ఈ కేంద్రంలోని భూములలో వరి, చెరకు వంటి పంటలతో పాటు వివిధ రకాల పండ్ల తోటలను పెంచేవారు. కోళ్లు, పశువుల పెంపకం చేస్తూ వీడీఓలకు శిక్షణలు ఇచ్చేవారు. అయితే వీడీఓల వ్యవస్థ రద్దు కావడంతో 2002 ఆగస్టు, 7న ఈ శిక్షణ కేంద్రాన్ని విస్తరణ శిక్షణా కేంద్రం(ఈటీసీ)గా పేరు మార్చారు. దాంతో పంటలు, పశువుల పెంపకం దూరం అయ్యాయి. శ్రీకాకుళం నుంచి ఏలూరు వరకు ఉన్న జిల్లాల వారికి ఈ కేంద్రంలో శిక్షణ ఇస్తున్నారు. రాష్ట్ర విభజన తరువాత సామర్లకోట, శ్రీకాళహస్తి, బాపట్ల ఈటీసీలు మాత్రమే రాష్ట్రంలో ఉన్నాయి.

జెడ్పీ సీఈఓ స్థాయి అధికారి ప్రిన్సిపాల్‌గా...

ఈ శిక్షణ కేంద్రంలో జెడ్పీ సీఈఓ స్థాయి అధికారి ప్రిన్సిపాల్‌గాను, ఇద్దరు గెజిటెడ్ అధికారులు, ఐదుగురు సీనియర్ పంచాయతీ కార్యదర్శులు ఫ్యాకల్టీలుగా శిక్షణ ఇస్తారు. ఆయా శాఖల్లో పరిపాలన పరంగా వస్తున్న మార్పులకు సంబంధించి ఫ్యాకల్టీలు రాష్ట్ర స్థాయిలో శిక్షణ పొంది ఈ కేంద్రానికి వచ్చిన వారికి శిక్షణ ఇస్తారు. ఈటీసీకి చెందిన స్థలాన్ని మండల పరిషత్తు కార్యాలయానికి, ప్రభుత్వాస్పత్రికి, సాంఘిక సంక్షేమశాఖ హాస్టల్ భవనాలకు, రాజీవ్ గృహకల్ప నిర్మాణాలకు వినియోగించారు. సుమారు 50 ఎకరాల్లో పేదలందరికీ ఇళ్లు కేటాయించారు. ఈ కేంద్రంలో మూడు ఎకరాల విస్తీర్ణంలో రంపచోడవరం గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గిరిజన యువతీ, యువకులకు శిక్షణ ఇవ్వడానికి శిక్షణ కేంద్ర భవనాలు నిర్మించారు. సుమారు మూడు ఎకరాల స్థలంలో గోదాముల నిర్మాణం జరుగుతోంది. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ (ఏపీఎస్ఐఆర్‌డీ) పర్యవేక్షణలో ఈటీసీలు ఉన్నాయి. ఈటీసీ పరిధిలో పని చేయడానికి ప్రతీ జిల్లాలోను ఒక జిల్లా పంచాయతీ రీసోర్సు సెంటర్ (డీపీఆర్‌సీ)ని ఏర్పాటు చేసి ఆయా సెంటర్లకు చెందిన సిబ్బందికి ఇప్పటికే శిక్షణ ఇచ్చారు.

సాంకేతిక పరిజ్ఞానంపై...



ప్రగతి సాధనలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక కొత్త పథకాలు అమలు చేస్తున్నాయి. వాటిపై అవగాహన చేసుకోవడానికి ప్రజా ప్రతినిధులు, ఉద్యోగులకు శిక్షణ ఎంతో అవసరం ఉంది. 2021–2022 ఆర్థిక సంవత్సరంలో వివిధ శాఖలకు చెందిన 37,964 మందికి శిక్షణ పూర్తి చేశాం. 2022–2023 ఆర్థిక సంవత్సరంలో 40,199 మందికి శిక్షణ ఇచ్చాం. 2023–2024లో రాష్ట్ర వ్యాప్తంగా నూతనంగా ఎంపిక అయిన 34 మంది ఎంపీడీఓలకు నెలరోజుల పాటు శిక్షణ ఇచ్చాం. పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఇవ్వడానికి మాస్టర్ ట్రైనర్లు 91 మందికి శిక్షణ ఇచ్చాం. 11 జిల్లాలకు చెందిన 173 మంది జెడ్పీటీసీ సభ్యులకు శిక్షణ పూర్తి చేశాం. డ్వామాలో 197 మంది ఏపీఓ, పీఓలకు శిక్షణ ఇవ్వగా మరో 200 మందికి ఇవ్వవలసి ఉంది. ఆగస్టు 29 నుంచి కాకినాడ జిల్లా, రంపచోడవరంలోని పంచాయతీ కార్యదర్శులు 575 మందికి శిక్షణ ప్రారంభిస్తాం.

– జి.వేణుగోపాల్, ఈటీసీ ప్రిన్సిపాల్, సామర్లకోట

విద్యార్థి ఆత్మహత్య

తుని: ఫ్యాన్‌కు ఉరేసుకుని ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పట్టణ ఎస్సై మురళీమోహన్ బుధవారం తెలిపారు. వివరాల్లోకెళితే స్థానిక శ్రీనివాస సెంటర్ రాజీవ్‌గృహ కల్పలో దేవారపు మణి, తన కుమారుడు దేవారపు బాలు(16) నివాసం ఉంటున్నారు. దేవారపు మణి జీవనోపాధి కోసం పట్టణంలో ఓ షాపులో పని చేస్తుండగా బాలు 9వ తరగతి చదువుతున్నాడు. దేవారపు మణి రోజూ మాదిరిగానే షాపుకెళ్లి మంగళవారం సాయంత్రం ఇంటికొచ్చే సరికి బాలు ఇంట్లో ఫ్యానుకు చున్నీతో ఉరి వేసుకున్నాడు. బాగా చదువుకోవాలని తల్లి మందలించడంతోనే ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు భావిస్తున్నారు. బాలు తల్లి మణి బుధవారం పట్టణ పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

24 నుంచి ఫుట్‌బాల్ పోటీలు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): జిల్లా ఫుట్‌బాల్ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 24 నుంచి 28 వరకు కాకినాడ జిల్లా క్రీడామైదానంలో జిల్లాస్థాయి ఫుట్‌బాల్ క్రీడాకారుల ఎంపికలు, పోటీలు నిర్వహిస్తున్నట్లు సంఘ కార్యదర్శి రాజేష్ బుధవారం తెలిపారు. జూనియర్స్, సీనియర్స్ విభాగంలో బాలురు, బాలికల అంశంలో ఎంపికలు జరుగుతాయన్నారు. ఫుట్‌బాల్ కోచ్ స్వామి శ్రీనివాస్ పర్యవేక్షణలో జరిగే ఈ ఎంపికలకు ఆసక్తి గలవారు హాజరుకావాలని, వివరాలకు 8328643876 నంబరులో సంప్రదించాలని కోరారు. ఎంపికైన జట్లు జోనల్ రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలలో జిల్లా తరపున పాల్గొంటాయన్నారు.

తెలుగు ఔన్నత్యాన్ని కాపాడుతున్న ప్రభుత్వం

- వీసీ ఆచార్య పద్మరాజు
- 'నన్నయ'లో ప్రారంభమైన సహస్రాబ్ది ఉత్సవాలు



జ్యోతి ప్రకాశనంలో పాల్గొన్న లక్ష్మీపార్వతి, వీసీ పద్మరాజు, రఘునాథశర్మ, రామబ్రహ్మం తదితరులు

రాజానగరం: రాష్ట్రంలో తెలుగు భాష ఔన్నత్యాన్ని కాపాడుతూ ఆంగ్ల భాషలో కూడా విద్యార్థులు మంచి పట్టును సాధించే దిశగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దడం హర్షణీయమని ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు అన్నారు. తెలుగు భాషతోపాటు, ఆంగ్ల భాషలో కూడా విద్యాబోధన జరిగే విధంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విద్యారంగంలో అనేక మార్పులు తీసుకురావడం సంతోషమని అన్నారు.

ఆదికవి నన్నయ యూనివర్సిటీలోని ఎన్టీఆర్ కన్వెన్షన్ హాలులో రెండు రోజులపాటు జరిగే 'ఆదికవి నన్నయ మహాభారత రచన, రాజరాజనరేంద్రుని పట్టాభిషేక సహస్రాబ్ది ఉత్సవాల'ను బుధవారం జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఉపకులపతి మాట్లాడుతూ దేశంలో వెయ్యేళ్ల చరిత్ర గల నగరాలు బెనారస్, మధురై, తంజావూరుల సరసన చేరే నగరం రాజమహేంద్రవరమన్నారు. అంతటి ఖ్యాతిని ఆర్జించడానికి ప్రధాన కారకులైన ఆదికవి నన్నయ, రాజరాజనరేంద్రుల పేరిట నిర్వహించే సహస్రాబ్ది ఉత్సవాలకు ఈ యూనివర్సిటీ వేదిక కావడం ఆనందకరమన్నారు. తమిళనాడులోని తంజావూరులో అతిపెద్ద తెలుగు లైబ్రరీ ఉందని, అందుకుగల కారణం ఏమిటని పరిశీలిస్తే చాళుక్యులు, చోళులు మేనత్త, మేనమామ వరస అవుతారని తెలిసిందన్నారు. తెలుగు భాష పట్ల వారికి ఉన్న అభిమానం, అవగాహనలతో ప్రాధాన్యత ఇవ్వడంతోనే ఇది సాధ్యమైందన్నారు. తంజావూరులోని మేనమామ రాజేంద్రచోళుని కుమార్తెను వివాహమాడారన్నారు. దాయాదుల పోరును తప్పించుకోవడానికి క్రీ.శ. 1022లో రాజమహేంద్రవరానికి రాజుగా పట్టాభిక్తుడయ్యాడని వివరించారు. ఆయన ఆస్థాన పండితులు నన్నయ భట్టు అని, నన్నయ పూర్వీకులు తెలుగు, సంస్కృత భాషలలో శాసనాలు రాసినట్టుగా ఆధారాలున్నాయన్నారు. నన్నయ తెలుగు భాష, సాహిత్యాలకు దిశానిర్దేశం చేశారన్నారు. రాజరాజనరేంద్రునికి భారతం అంటే ఎంతో ఇష్టమని, తమ పూర్వీకులైన కౌరవ, పాండవుల చరిత్ర అయిన మహాభారతం 'జయసంహిత' పేరుతో సంస్కృత భాషలో ఉంటే తమిళంలోకి తర్జుమా చేయించారన్నారు. తెలుగులోకి కూడా తర్జుమా జరగాలనే రాజరాజనరేంద్రుని ప్రేరణతోనే ఆదికవి నన్నయ రాయడంతో ఆదికావ్యంగా నిలిచిందన్నారు.

29న తెలుగు భాషా దినోత్సవం 'నన్నయ'లోనే..

గౌరవ అతిథిగా పాల్గొన్న రాష్ట్ర తెలుగు సాంస్కృతిక అకాడమీ చైర్‌పర్సన్ నందమూరి లక్ష్మీపార్వతి మాట్లాడుతూ ఈ నెల 29న గిడుగు రామ్మూర్తి పంతులు జయంతిని పురస్కరించుకుని నిర్వహించే తెలుగు భాషా దినోత్సవాన్ని ఆదికవి నన్నయ యూనివర్సిటీలో ప్రభుత్వం తరపున నిర్వహిస్తామన్నారు. రాజరాజనరేంద్రుడు సాహిత్యాన్ని పోషించారని, నన్నయ ద్వారా మహాభారత ఆంధ్రీకరణకు పూనుకున్నారన్నారు. నన్నయభట్టే ఆదికవి అని, ఈ విషయంలో పసీపాలా లేనివారు చెప్పే కట్టుకథలను నమ్మకుండా తెలుగు భాష ఔన్నత్యాన్ని పెంపొందించుకోవాలని హితవు పలికారు.

సాహిత్య అకాడమీ కార్యదర్శి కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ రాజరాజనరేంద్రుడు, నన్నయ గురించి వివరించారు. సాహిత్య అకాడమీ తెలుగు సలహా మండలి ప్రతినిధి సి.మృణాళిని మాట్లాడుతూ పుణ్యం కోసం రామాయణాన్ని, పురుషార్థం కోసం మహాభారతాన్ని చదవాలన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, తెలుగు సంస్కృత పండితులు శలాక రఘునాథశర్మ, బేతవోలు రామబ్రహ్మం, సదస్సు కన్వీనర్ డాక్టర్ కేవీఎన్‌డీ వరప్రసాద్, కో కన్వీనర్లు డాక్టర్ తలారి వాసు, డాక్టర్ తరపట్ల సత్యనారాయణ, డాక్టర్ డి. లక్ష్మీనరసమ్మ, డాక్టర్ సీహెచ్ మురళీకృష్ణ, డాక్టర్ పీపీ నాయుడు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నందంపూడి శాసనాన్ని ఆవిష్కరించిన ఎంపీ

దేశంలో వెయ్యేళ్ల చరిత్ర గల నగరాలలో ఒకటిగా ఉన్న రాజమహేంద్రవరం కీర్తి, ప్రతిష్టలను కాపాడుకోవలసిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీలోని ఎన్టీఆర్ కన్వెన్షన్ హాలులో రెండు రోజులపాటు జరిగే 'ఆదికవి నన్నయ మహాభారత రచన, రాజరాజనరేంద్రుని పట్టాభిషేక సహస్రాబ్ది ఉత్సవాలు' బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వీటి ప్రారంభ సూచికగా రాజరాజనరేంద్రుని శాసనాలు (రాగి రేకులపై రాసినవి) అందరికీ దర్శనమిచ్చే విధంగా 'నన్నమ పూణ్ని శాసనం'గా చెక్కించిన శిలాఫలకాన్ని ఎంపీ భరత్‌రామ్, రాష్ట్ర తెలుగు సాంస్కృతిక అకాడమీ చైర్‌పర్సన్ నందమూరి లక్ష్మీపార్వతి, 'నన్నయ' వీసీ ఆచార్య పద్మరాజు సంయుక్తంగా ప్రారంభించారు. ఇటువంటి అరుదైన శాసనాలను భావితరాలకు కూడా తెలిసే విధంగా పరిరక్షించుకోవాలన్నారు. వెయ్యేళ్ల నాటి శాసనాలను ఈ విధంగా బయటకు తీసుకువచ్చిన వీసీ ఆచార్య పద్మరాజును వారు అభినందించారు. కార్యక్రమంలో కేంద్ర సాహిత్య అకాడమీ ప్రతినిధులు, పండితులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ భరత్‌రామ్, అకాడమీ చైర్‌పర్సన్ లక్ష్మీపార్వతి, వీసీ పద్మరాజు

యువకుని మృతదేహం లభ్యం

కాట్రేనికోన: మండలంలోని బ్రహ్మసమేథ్యం పంచాయతీ నీళ్ళరేవు సముద్ర తీరంలో కొప్పాడి సతీష్ 20 మృతదేహం లభ్యమైందని కుటుంబ సభ్యులు తెలిపారు. ఉప్పలగుప్తం మండలం రాఘవులుపేటకు చెందిన కొప్పాడి సతీష్ స్నేహితులతో కలసి మంగళవారం ఎస్.యానం సమీపంలో బీచ్‌కు వెళ్లి సముద్ర స్నానం చేస్తున్న సమయంలో కెరటాల ఉధృతికి కొట్టుకుపోయాడు. గల్లంతైన సతీష్ కోసం ఎస్సై వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పోలీసులు, గ్రామస్తులు సముద్ర తీరం వెంబడి గాలించారు. కాట్రేనికోన మండలం బ్రహ్మసమేథ్యం పంచాయతీ నీళ్ళరేవు సమీపంలో సముద్రపు ఒడ్డుకు మృతదేహం కొట్టుకు వచ్చిందనే సమాచారంతో కుటుంబ సభ్యులు చేరుకుని సతీష్‌గా గుర్తించారు. మృతదేహంను పోస్టుమార్టంకు తరలించారు.

ఘనంగా విజయదుర్గా పీఠం వార్షికోత్సవం



పీఠంలో గణపతి పూజ చేస్తున్న వేద పండితులు



పీఠాధిపతి గాడ్‌ను సత్కరిస్తున్న భక్తులు

వినాయకుడికి గరికిపూజ, హోమం, అమ్మవారికి గులాబీల అర్చన

రాయవరం: మండలంలోని వెదురుపాక విజయదుర్గా పీఠంలో ఆధ్యాత్మికత వెల్లివిరుస్తోంది. పీఠం 51వ వార్షికోత్సవంలో భాగంగా బుధవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పీఠాధిపతి వాడ్రేవు వెంకటసుబ్రహ్మణ్యం(గాడ్) కుమార్తె సత్యవెంకటకామేశ్వరి చేతుల మీదుగా జ్యోతి వెలిగించి వేడుకలను ప్రారంభించారు. ఈ వేడుకల్లో భాగంగా చిత్తూరు జిల్లా కాణిపాకం ఆలయ వేద పండితులు పాల్గొని వినాయకుడికి గరిక పూజ, హోమం నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహానికి ఖడ్గమాల, గులాబీ అర్చనలు, నీరాజన మంత్ర పుష్పాలు, మహా నివేదన చేపట్టారు. పీఠాధిపతి గాడ్ భక్తులనుద్దేశించి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దైవ చింతన కలిగి ఉండాలన్నారు. ఈ సందర్భంగా భక్తులు పీఠాధిపతి గాడ్‌ను సత్కరించారు. పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు, పీఆర్వో వాడ్రేవు వేణుగోపాల్(బాబి)ల ఆధ్వర్యంలో భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు. వార్షికోత్సవంలో నెల్లూరు జిల్లా గూడూరుకు చెందిన ఆధ్యాత్మికవేత్త కోట సునీల్‌కుమార్, అన్నవరం దేవస్థానం పాలకమండలి మాజీ సభ్యుడు కందర్ప హనుమాన్, విజయదుర్గా సేవా సమితి ప్రతినిధులు గాదె భాస్కరనారాయణ, పెదపాగి సత్య కనకదుర్గ, బి.రమ పాల్గొన్నారు.

22.29 టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం

- ముగ్గురిపై కేసు నమోదు
- విజయవాడ నుంచి కాకినాడ వెళుతున్నట్టు సమాచారం



అనంతపల్లిలో సివిల్ సప్లయి అధికారులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం

కొవ్వూరు: లారీలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని బుధవారం అధికారులు పట్టుకున్నారు. పట్టణంలో గామన్ ఇండియా బ్రిడ్జి టోల్ గేట్ వద్ద లారీని ఆపి తనిఖీ చేయగా ఏవిధమైన ఆధారాల్లేకుండా అక్రమంగా బియ్యం తరలిస్తున్నట్టు గుర్తించినట్లు సీఎస్‌డీటీ జి.బాపిరాజు తెలిపారు. లారీలో ఉన్న 22.290 టన్నుల బియ్యాన్ని స్వాధీనం చేసుకుని ఉనగట్లలోని పౌర సరఫరాల గోదాముకి తరలించామన్నారు. లారీతో పాటు కలిపి బియ్యం విలువ రూ.20.91లక్షలుగా నిర్ధారించామన్నారు. విజయవాడ నుంచి కాకినాడ తరలిస్తున్నట్లు ప్రాథమికంగా గుర్తించామన్నారు. ఇవి నూజివీడుకి చెందిన పెద్దిరెడ్ల రామచంద్రరావుకు చెందిన బియ్యం అన్నారు. విజయవాడ శివారున రామవరప్పాడులో బియ్యం లోడ్ అయినట్లు డ్రైవర్ పెద్దింటి వేణు తెలిపారన్నారు. లారీ గొల్లప్రోలుకి చెందిన పడాల సూరిబాబుకి చెందినదన్నారు. ఈ కేసులో డ్రైవర్ వేణుతో పాటు బియ్యం యాజమాని, లారీ ఓనర్ సూరిబాబులపై పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సీఎస్‌డీటీ తెలిపారు. డ్రైవర్ కాకినాడ జిల్లా పిఠాపురానికి చెందిన వాడన్నారు. లారీని, డ్రైవర్‌ను పట్టణ పోలీసులకు అప్పగించినట్లు సీఎస్‌డీటీ తెలిపారు.

అనంతపల్లిలో..

నల్లజర్ల: మండలంలోని అనంతపల్లిలో ఓ ఇంటిపై సివిల్ సప్లయి అధికారులు దాడి చేసి 505 కిలోల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నారు. ఈ బియ్యం లంక వెంకటకృష్ణకు చెందినవిగా గుర్తించారు. 6ఏ కేసు నమోదు చేసినట్టు సివిల్ సప్లయి డీటీ ఎ.సత్యనారాయణ తెలిపారు.